అనంతపురం/శ్రీ సత్యసాయి
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
శుక్రవారం 09 డిసెంబర్ 2022 పేజీలు : 04



స్థానిక ఆర్అండ్బి వసతి గృహంలో రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డిని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు.

# హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతం



**అనంతపురం న్యూటౌన్, డిసెంబర్ 8 ప్రభాతవార్త**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కంచిరెడ్డి సురేష్‌రెడ్డిని స్థానిక ఆర్అండ్బి అతిథి గృహంలో మర్యాద పూర్వకంగా జిల్లా జడ్జి జి.శ్రీనివాస్, జిల్లా ఎస్పీ పక్కీరప్ప పుష్పగుచ్ఛం అందజేసి ఘనంగా స్వాగతం పలికారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘన స్వాగతంపలుకుతున్న దృశ్యం

# వేగంగా రీ సర్వే పనులు

## - ఎంపిఎఫ్‌సి గోడౌన్‌ల కొరకు స్థలసేకరణ -జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్



వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, ఇతర ఉన్నతాధికారులు

**శ్రీసత్యసాయిజిల్లా, డిసెంబర్ 08, ప్రభాతవార్త ప్రతినిధి:**

శ్రీసత్యసాయి జిల్లా నందు వైఎస్ఆర్ శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం క్రింద వేగంగా రీ సర్వే పనులను చేపడుతున్నట్లు సిసిఎల్ఎ స్పెషల్ చీఫ్ కార్యదర్శి జి.సాయిప్రసాద్, రాజధాని కార్యాలయం నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహార్ రెడ్డిలతో వేరువేరుగా నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లలో జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్‌కు వివరించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌ల యందు కలెక్టర్ బసంత్‌కుమార్‌తో పాటు సంయుక్త కలెక్టర్ టి.ఎస్.చేతన్, ఇన్‌చార్జ్ డిఆర్ఓ భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం క్రింద రీ సర్వే పనులు త్వరితగతిన చేపట్టేలా అన్నిరకాల చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో ఎంపిక చేసిన 2000 గ్రామాలకు సంబంధించిన 13వ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందని, అనంతరం చేపట్టవలసిన ప్రక్రియలను సకాలంలో చేపడతామన్నారు. ఆయా గ్రామాల్లో గ్రౌండ్ టు థింగ్, గ్రౌండ్ వ్యాల్యుడేషన్ తదితర ప్రకియలను వేగవంతంగా చేస్తామన్నారు. జాతీయ రహదారుల కోసం 400 హెక్టార్ల భూసేకరణ కార్యక్రమం డిసెంబర్ మాసంలోపు పూర్తి చేయడం జరుగుతుందని కలెక్టర్ వివరించారు. అలాగే విజయవాడ ఎంపిఎఫ్‌సి గౌడోన్‌ల నిర్మాణం, జగనన్న పాల వెల్లువ, తదితర అంశాలపై రాష్ట్ర సహకార శాఖ కమీషనర్ అహ్మద్ బాబు అన్ని జిల్లాల కలెక్టర్లతో నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్ నందు జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్, డిసిఓ కృష్ణానాయక్, వెంటర్నరీ డాక్టర్ శ్రీనివాస్ తితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బసంత్‌కుమార్ మాట్లాడుతూ, మల్టిపర్పస్ ఫెసిలిటీ సెంటర్స్ గోడౌన్‌లకు సంబంధించి జిల్లాలో మూడవ దశలో 109 గోడౌన్‌లు మంజూరు కాగా, 22 గోడౌన్‌లకు స్థలసేకరణ పూర్తి చేసినట్లు తెలిపారు. మిగిలిన వాటికి త్వరితగతిన స్థలసేకరణ పూర్తి చేస్తామన్నారు. ఇంతకుముందు మొదటి, రెండవ దశలలో మంజూరైన గోడౌన్‌ల నిర్మాణం వేగంగా చేపడుతున్నామని, జగనన్న పాల వెల్లువకు సంబంధించి జిల్లాలో ఇప్పటికే 83 గ్రామాల్లో పాలసేకరణ చేపడుతున్నామని, ఈ నెల 21వ తేది నాటికి మరో 60 గ్రామాల్లో పాలసేకరణ ప్రక్రియను ప్రారంభించిన అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు తెలియజేశారు. జిల్లాలోని గాండ్లపెంట మండలంలో 7 గ్రామాల్లో కదిరి మండలంలో ఒక గ్రామంలో, నంబులపూలకుంట మండలంలోని 8 గ్రామాల్లో, తలుపుల మండలంలో 19 గ్రామాల్లో, నల్లచెరువు మండలంలో 5 గ్రామాల్లో, తనకల్లు మండలంలో 20 గ్రామాల్లో, పాలసేకరణ మొదలు పెట్టేలా కృషి చేస్తున్నామన్నారు.

## పార్టీ బలోపేతమే లక్ష్యంగా..

# నేటి నుంచి మంత్రి పెద్దిరెడ్డి పర్యటనలు



మంత్రి పెద్దిరెడ్డి

**అనంతపురం సిటీ, డిసెంబర్ 8 ప్రభాతవార్త**

వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీని మరోమారు అధికారంలోకి తీసుకురావడమే లక్ష్యంగాపార్టీ బలోపేతం కోసం రాష్ట్ర మంత్రి, రాయలసీమ ఇన్‌చార్జ్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నియోజకవర్గాల వారీగాసమీక్షా సమావేశాలను నిర్వహించనున్నారు. అనంతపురం జిల్లాపరిధిలోని 8 నియోజకవర్గాల్లో నాలుగు రోజులపాటు రోజుకు రెండు నియోజకవర్గాల చొప్పున రీజనల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నేతలతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నారు. అందులో భాగంగా శనివారం కళ్యాణదుర్గం, రాయదుర్గం, 10న గుంతకల్లు,ఉరవకొండ, 11 తాడిపత్రి, శింగనమల, 12న రాప్తాడు అనంతపురం నియోజకవర్గాలలో పర్యటించి సమీక్ష సమావేశాలను నిర్వహించనున్నారు. ప్రధానంగా పార్టీ ముఖ్య నేతలు సమీక్ష సమావేశంనిర్వహిస్తూపార్టీలో ఉన్నచిన్నచిన్న సమస్యలపై దృష్టి సారించడంతోపాటు పార్టీ బలోపేతం కోసం తీసుకోవాల్సిన చర్యలపై ప్రధానంగా దృష్టి సారించనున్నట్లు తెలిసింది. 2024ఎన్నికల్లో వైఎస్ఆర్‌కాంగ్రెస్ పార్టీని మరోమారు అధికారంలోకి తీసుకురావడమేలక్ష్యంగా ఈసమీక్షా సమావేశాల్లో చర్చించనున్నట్లు తెలుస్తోంది. కాగా అధికారంలోకి వచ్చి మూడున్నరేళ్లు గడిచినప్పటికీ పార్టీ శ్రేణులకు అధిష్టానం నుంచి సరైన ఆర్థిక భరోసా లభించలేదన్న భావనతో కార్యకర్తలు పార్టీ శ్రేణులు ఉన్న నేపథ్యంలో ఈ సమీక్షా సమావేశాల్లో పార్టీ శ్రేణుల్లో తమగళాన్ని మంత్రి పెద్దిరెడ్డిరామచంద్రారెడ్డి దృష్టికి తీసుకెళ్లే అవకాశాలు స్పష్టంగాకనిపిస్తున్నాయి. మరో ఏడాదిన్నర ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో మంత్రి పార్టీ శ్రేణులతో సమీక్ష నిర్వహిస్తుండటం ప్రాధాన్యత సంతరించుకుంటోంది.

# పేరుకేమో కమ్యూనిస్ట్ సంఘం..

## - నాయకులు జత కట్టేదేమో బినామీతో..కార్యకర్తలకు పంగనామాలు
## - పశ్చిమ రాయలసీమ టీచర్స్ ఎంఎల్‌సి ఎన్నికల్లో అసహజ సంబంధాలు

అది దశాబ్దాల చరిత్ర కలిగిన సంఘం, అందునా తరిమెల నాగిరెడ్డి ఆశయాలతో నడుస్తున్నామని చెప్పుకునే సంఘం. చాలా టీచర్ సంఘాలకు మాతృ సంఘం. గత చరిత్ర ఎంతో ఘనం, ఉపాధ్యాయ సమస్యల పరిష్కారం కోసం తమ జీవితాలనే త్యాగం చేసిన ఎంఎల్‌సిలు, కార్యకర్తలు నిర్మించిన సంఘం. ఇప్పుడేమో విలువలు లేని రిటైర్మెంట్ వయసు దాటినా కూడా ఆలోచనల్లో పర్వక్వత రాని ఇద్దరు చేతగాని వ్యక్తుల చేతుల్లో పడి కునారిల్లుతోంది.

**తాడిపత్రి అర్బన్, డిశంబర్ 8 ప్రభాతవార్త**

పశ్చిమ రాయలసీమ టీచర్ ఎంఎల్‌సి ఎన్నికల్లో తమ సంఘం నుండి ఉత్సాహవంతులైన వ్యక్తులు వున్నప్పటికి తమ చాందస వాదంతో సంఘంలోని మిగిలిన నాయకుల అభిప్రాయాలను పరిగణ లోకి తీసుకోకుండా సంఘంలోని సభ్యుల మనోభావాలను పట్టించుకో కుండా ఒక నియంతృత్వ పోకడతో తాము ఉపాధ్యాయులమే మనం బినామీగా గుర్తింపు పొందిన వ్యక్తికి మద్దతు ఇస్తే సమాజంలో ఉపాధ్యా యులకు ఎలాంటి గుర్తింపు దక్కుతుంది అన్న ధ్యాస కూడా లేకుండా బినామీగా గుర్తింపు పొందిన వ్యక్తికి మద్దతు ప్రకటించారు. ఒకవైపు ఉపాధ్యాయులు అష్ట కష్టాలు పడుతూ తమ మనుగడే ప్రశ్నార్థకంగా మారి ఈ రోజు గడిస్తే చాలు అని దిన దినగండంగా బ్రతుకుతున్న ఈ పరిస్థితుల్లో పోరాట యోధులకు వారసునిగా బినామీగా గుర్తింపు పొందిన వ్యక్తికి మద్దతు ప్రకటించడం హాస్యాస్పదం. ఈ బినామీ గారు 6 సంవత్సరాలుగా టీచర్స్ సమస్యల మీద పోరాడుతున్నానంటారు కానీ పిఆర్‌సి ఉద్యమ్యంలో ఎక్కడా కనబడలేదు. పైగా ఫిట్మెంట్ 23 శాతంకు రివర్స్ అయితే టీచర్ల జీతాలు పెరిగాయి. అన్ని స్టేట్మెంట్ ఇచ్చిన ఒక టీచర్ ఎంఎల్‌సిని ఘనంగా సన్మానించిన ఘనుడు ఈ బినామీ గారు. ఇంకా హాస్యాస్పదం ఏంటంటే ఇలాంటి పెద్ద సంఘాల గుర్తింపు రద్దు చేయాలని, ఘనత వహించిన ఈ బినామీ గారు ఒక తుపాకీ సంఘం తోడుగా ప్రభుత్వానికి కంప్లెంట్ ఇచ్చారు. సంఘాలు పోలీసుల లాంటివి, ఎంత మంది ఎన్ని తిట్టుకున్నా, పోలీసులు లేకపోతే వ్యవస్థ మనుగడే ప్రశ్నార్థకమవుతుంది. తమలాంటి రికగ్నైజ్డ్ సంఘాల గుర్తింపును రద్దు చేయాలని కంప్లెంట్ ఇచ్చిన వ్యక్తికే మద్దతు ఇవ్వాలనుకోవడం రాజకీయ మాయ కాకుండా ఇంకేమనాలి. సమాజ సేవ చేసే మేధావులనో లేక తమ సంఘంలోనే సమర్థుడైన అభ్యర్థినో రంగంలోకి దింపక పోవడానికి కారణం, ఆ ఉపాధ్యాయుడు సంఘంలో తమకు మించి పోతాడే మోనన్న భయమేనని గుసగుసలు వినపడుతున్నాయి. తమ సంఘం లో ఎంతో మంది సమర్థులు వున్న ప్పటికి వాళ్లకు సంఘ బాధ్యతలు అప్పచెప్పకుండా తమ కనసన్నల్లోనే సంఘాన్ని శాసిస్తూ సంఘ సభ్యుల మీద తమ చాందసబావాలను రుద్దుతూనే వున్నారు. ఈ మొత్తం రామ రంగ నాటకంలో ఆ సంఘం సభ్యులు, సాధారణ ఉపాధ్యాయులే సమిదలు.

# అంగరంగ వైభవంగా సిద్ధేశ్వర లక్షదీపోత్సవ, పూల రథోత్సవ వేడుకలు



ప్రత్యేక అలంకరణలో హేంజేరు సిద్ధేశ్వరస్వామి

**అమరాపురం, డిసెంబర్ 8 ప్రభాతవార్త**

మండల పరిధినిలో హేమావతి హేంజేరు సిద్ధేశ్వర దేవాలయంలో మార్గశిర పౌర్ణమి సంద్బంగా రజత వేడుకల్లో భాగంగా లక్షదీపోత్సవం, పూల రథోత్సవ వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. స్వామి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే ఆలయ కమిటి చైర్మన్ మంజునాథ్, ఈఓ నాగేంద్రప్రసాద్‌రావు సమక్షంలో పాలాభిషేకం, పుష్పాభిషేకం, గంధాభిషేకం, వివిధ పూజా కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఆంధ్రతోపాటు, కర్నాటక ప్రాంతం నుంచి భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దీపాలు వెలిగించి మొక్కులు తీరుచ్చుకున్నారు. దేవాలయంలో పూల రథోత్సవాన్ని మేళా తాళాలతో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి వేడుకలను వైభంగా నిర్వహించారు. ఆలయ కమిటి సభ్యులు భక్తాదులకు ఇబ్బందులు లేకుండా క్యూలైన్ ఏర్పాటు చేశారు. పురాత చరిత్ర కలిగిన సిద్దేశ్వరస్వామి మూలవిరాట్‌కు దొడ్డేశ్వరస్వామి ఆలయంలో శివలింగం, గంగామాళమ్మ, అక్కాచెల్లల దేవాలయం హంపన్న తాత దేవాలయాల వద్ద ప్రత్యేక పూజలు జరిగాయి. మడకశిర ఎమ్మెల్యే డా. తిప్పేస్వామి విచ్చే లక్ష దీపోత్సవ వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేకు ఆలయ కమిటి చైర్మన్ మంజునాథ్, స్థానిక సర్పంచ్ తిప్పేస్వామి, ఎంపిపి వీరన్న, జెడ్పిటిసి స్వారక్క నరసింహామూర్తి, వైస్ ఎంపిపి కృష్ణమూర్తి, ఎంపిటిసి జయరామ్‌తోపాటు స్థానిక నాయకులు స్వాగతం పలికారు. స్వామి వారికి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమాన్ని దాతలు కుమారస్వామి, అరవిందరెడ్డి, కెంకెర తిప్పేస్వామి, ఈరన్న, గోవిందరాజు, లక్ష్మీనారాయణచారి, అశ్వర్థనారాయణశెట్టి తదితరులు విచ్చేసిన భక్తులకు అన్న ప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో ఆంధ్ర, కర్నాటక ప్రాంతాల భక్తులు స్థానిక గ్రామ కార్యదర్శి నరేష్, జూనియర్ అసిస్టెంట్ మారుతి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



విద్యుత్ దీపాలతో అలంకరణ

# రోడ్డు ప్రమాదాలలో యజమాని మృతి చెందడం కాదు కుటుంబం మొత్తం రోడ్డున పడ్డట్టే

## - గమ్యానికి చేరుకోవడానికి తొందరపాటు వద్దు
## - మీ కుటుంబ సభ్యులు ఎదురుచూస్తున్నారన్న సంగతి మరవద్దు
## - కదిరి ఎంవిఐ వరప్రసాద్



కదిరి డిఎస్ఎం వరప్రసాద్

**కదిరి టౌన్, డిసెంబర్ 8, ప్రభాతవార్త :**

ద్విచక్ర వాహనాలు, జీపులు, కార్లు, లారీలు, బస్సులు తదితర వాహనాలు నడిపే డ్రైవర్లు, యజమానులు, వాహనచోదకులు ఎదైనా తొందరపాటు వల్ల, మితిమీరిన వేగంవల్ల, అతిగా మద్యం సేవించడం వల్ల తరచుగా ప్రమాదాలకు గురై మృతి చెందుతుంటారని కదిరి మోటార్ వాహనాల తనిఖీ అధికారి డిఎస్ఎం వరప్రసాద్ తెలిపారు. ఇందులో భాగంగా గురువారం ప్రమాదాల నివారణ, తగిన జాగ్రత్తలు, సలహాలు సూచనలను ఇచ్చి వాహన చోదకులకు అవగాహ కల్పించారు. ఈ సందర్భంగా రోడ్డు ప్రమాదాలలో యజమాని మృతి చెందడం వల్ల కుటుంబం మొత్తం రోడ్డున పడుతుందని ఆ విషయాన్ని తప్పనిసరిగా వాహనం నడిపే ప్రతి ఒక్కరు గుర్తెరిగి మసలుకోవాలన్నారు. గమ్యానికి చేరుకోవడానికి వాహన యజమానులు, డ్రైవర్లు మితిమీరిన వేగంతోనో, పార్టీలకు, పబ్బులకు వెళ్లి స్నేహితులు, బంధువులతో కలసి మద్యం సేవించి ఉత్సాహంగా, ఉల్లాసంగా వాహనాలను నడుపుతూ మయమరచిపోయే విదంగా వాహనాలను నడిపి ప్రమాదాలకు గురై తీవ్ర గాయాలతోనో ప్రాణాపాయ స్థితిలోనో కొట్టుమిట్టాడుతూ ఆసుపత్రులలో చికిత్స పొందుతూ ఉంటారన్నారు. ఆ ప్రమాదం జరగకముందే ఒక్క క్షణం ఆలోచించి తమ కుటుంబ సభ్యులు తమ కోసం ఎదురుచూస్తుంటారన్న అత యంత విలువైన విషయాన్ని గుర్తుకు చేసుకుంటే ప్రమాదాలు చాలా వరకూ నివారించవచ్చునన్నారు. ముఖ్యంగా సెల్ ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలను నడుపరాదన్నారు. తల్లిదండ్రులు విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు గట్టి పునాది వేయాలి కాని వాహనాలను చేతికి ఇచ్చి వారి జీవితాలతో చెలగాటం ఆడవద్దని ఎంఈఐ వరప్రసాద్ హితవు పలికారు. ముఖ్యంగా లైసెన్స్‌లు తప్పనిసరిగా ఉండాలని నడిపే వాహనం పూరి కండీషనలో ఉండాలని అలాగే ఇన్సూరెన్స్ తప్పనిసరిగా ఉండాలన్నారు. ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు సొంతంగా హై ఫోకస్ ఎల్ఈడి బల్బులను ఏర్పాటు చేసుకుంటే జరిమానా విదించి వాహనాన్ని సీజ్ చేస్తామని ఆయన హెచ్చరించారు. మరీ ముఖ్యంగా ఇటీవల కాలంలో ఎక్కువ శాతం ఆటోలు, ద్విచక్ర వాహనచోదకులు అధికశాతం హైఫోకస్ కలిగిన ఎల్ఈడి బల్బులు సొంతంగా అమర్చుకుంటున్నట్లు తన దృష్టికి వచ్చిందని త్వరలోనే వాటిపై నిఘా ఏర్పాటు చేసి స్పెషల్‌డ్రైవ్‌ను నిర్వహిస్తామని ఎంవిఐ స్పష్టం చేశారు.

# కన్నుల పండువగా ఖాద్రీశుని తెప్పతిరుణాల

## - విశేషంగా తరలివచ్చిన భక్తులు



శ్రీవారి తెప్పోత్సవంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సిద్ధారెడ్డి

**కదిరి, డిసెంబర్ 8, ప్రభాతవార్త :**

ప్రతి యేటా ధనుర్మాసంలో నిర్వహించే శ్రీదేవి, భూదేవి సమేతుడై వెలసిన ఖాద్రీ లక్ష్మీనరసింహాస్వామి తెప్పతిరుణాల మహోత్సవం గురువారం కన్నుల పండువగా నిర్వహించారు. ఉదయం 9 గంటల నుండి శ్రీవారు శ్రీదేవి, భూదేవి సమేతుడై విశేష అలంకరణల మధ్య మేళతాలాలతో మంగళవాయిద్యాలతో దేవళంబజార్, చౌకు, ఎక్బాల్ రోడ్, మార్కెట్ వీదులతో పాటు నాగిరెడ్డిపల్లి, కౌళేపల్లి మీదుగా దేవరచెరువు వరకూ గ్రామోత్సవాన్ని కదిరి ఎమ్మెల్యే డాక్టర్ పివి సిద్ధారెడ్డి ఆధ్వర్యంలో ఆలయ ఈఓ పట్టెం గురుప్రసాద్, చైర్మెన్ జెరిపిటి గోపాలక్రిష్ణ, ప్రధాన అర్చకులు నరసి ంహాచార్యులు, పార్థసారధి ఆచార్యులు, కుమార్ అచార్యులు, అంజనాచార్యులు నిర్వహించారు. గ్రామోత్సవం అనంతరం స్వామి వారిని ఆశేష భక్త జనసందోహం మధ్య తెప్పతిరుణాలలో కి ఆశీనులుగావించారు. తెప్పతిరుణాలలో వసంతవల్లభుడు, తూర్పు, పడమర, ఉత్తర, దక్షిణ ప్రాంతాలన్నీ దేవరచెరువులో ఊరేగారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సిద్ధారెడ్డి, వాల్మీకి పవన్‌కుమార్‌రెడ్డి, అనిల్‌కుమార్‌రెడ్డి, ఎంపిపి తోట అమర్నాథ్‌రెడ్డి, జడ్పిటిసి రాధా బాయి, ఎస్టీసెల్ క్రిష్ణానాయక్ తదితరులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తిరుమాడ వీధులు మదనపల్లి రోడ్డు, తేరుబజారు మొత్తం నరసింహాస్వామి భక్తుల కోలాహలం మధ్య అంగరంగ వైభోగంగా ఎంతో పవిత్రంగా జరిగింది. విచ్చేసిన భక్తులకు ఆలయ కమిటీ తీర్థప్రసాదాలను అందచేశారు.

## ఘనంగా శ్రీ ఆంజినేయస్వామి

# రథోత్సవం..!



శ్రీ ఆంజినేయస్వామి రథోత్సవాన్ని లాగుతున్న భక్తులు, నాయకులు తదితరులు

**మడకశిర టౌన్, డిసెంబర్ 8 ప్రభాతవార్త**

మడకశిర మండలంలోని భక్తరపల్లి శ్రీ లక్ష్మినరసింహస్వామి, జిల్లేడు గుంట ఆంజినేయస్వామి వార్ల బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు జిల్లేడుగుంట ఆంజినేయ స్వామి సన్నిధిలో స్వామివారి బ్రహ్మరథోత్సవం నేత్రపర్వంగా జరిగింది. శ్రీ లక్ష్మినరసింహ స్వామి, ఆంజినేయస్వామి వారి బ్రహ్మోత్సవాలు ప్రతిఏటా మార్గశిర మాసంలో వారంరోజుల పాటు వైభవంగా నిర్వహిస్తారు. ఇందులో భాగంగా గురువారం రథోత్సవం ఘనంగా జరిగింది. ఉదయం నుంచి ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన తరువాత స్వామివారి ఉత్సవ విగ్రహాలను మేళతాళాలతో ఊరేగింపుగా ఆలయ ప్రదక్షిణ చేసి, అనంతరం సుందరంగా వివిధ రకాల పూలతో అలంకరించిన దివ్య రథోత్సవం ముందు హోమం, పూర్ణాహుతి నిర్వహించి తరువాత అర్చకస్వాములు స్వామి వార్ల ఉత్సవ విగ్రహాలను రథోత్సవం చుట్టు ప్రదక్షిణలు చేయించి భక్తాదులు గోవింద నామాల నడుమ విగ్రహాలను రథత్సవంపై ఉంచి మహా మంగళహారతి గావించి రథోత్సవాన్ని ముందుకు లాగారు భక్తులు. ఈ రథోత్సవాన్ని తిలకించడానికి ఆంధ్ర, కర్ణాటక ప్రాంతాల నుంచి భక్తాదులు భారీగా తరలి వచ్చారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మాజీ మంత్రి రఘువీరారెడ్డి, ఎమ్మెల్యే తిప్పేస్వామి, భక్తులు తదితరులు పాల్గొన్నారు.



ప్రత్యేక పూజలు పాల్గొన్న మాజీ మంత్రి రఘువీరారెడ్డి

ఉట్టికి ఎగరలేని వారు.. స్వర్గానికి ఎగిరినట్టు ఉంది.. సీఎం జగన్ తీరు
బిసిలకు పెద్ద పీట వేసిన ఘనత వైఎస్ఆర్‌సిపిదే..!
4లో

## రాయదుర్గంలో పర్యటించిన ట్రైనీ కలెక్టర్

- ఉపాధి హామీ పథకంపై సమీక్ష సమావేశం

మల్లాపురం గ్రామ సచివాలయ నిర్మాణం పనులు పరిశీలన


పనులను పరిశీలిస్తున్న ట్రైనీ కలెక్టర్ ప్రశాంత్‌కుమార్

రాయదుర్గం డిసెంబర్ 8 ప్రభాతవార్త : మండలం నందు ట్రైనీ కలెక్టర సురపాటి ప్రశాంత్‌కుమార్ పర్యటించారు. మండల ప్రజా పరిషత్ కార్యాలయంను సందర్శించి ఎంపిడివో కార్యాలయంలో మహాత్మగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం కింద చేడపడుతున్న నర్సరీ మొక్కలను ఇన్సిట్యూషన్ ప్లాంటేషన్ హైడెన్సిటి ప్లాంటేషన్, రైన్‌హార్వెస్టింగ్ స్ట్రక్చర్‌ను పరిశీలించారు. అనంతరం మల్లాపురం గ్రామ సచివాయం నిర్మాణ పనులను పరిశీలించి పురోగతి తెలుసుకున్నారు. ఎస్ డబ్ల్యూ పిసి కేంద్రం పరిశీలించి తడిచెత్త పొడి చెత్త ద్వారా తయారు చేస్తున్న వర్మీ కాంపోస్ట్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో తహాశీల్దార్‌మారుతి, ఎంపిడిఓకొండయ్య, గ్రామీణ అభివృద్ధి విస్తరణ అధికారి రఘురామయ్య సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థులో నైపుణ్యం వెలికి తీయాలి


సమావేశంలో మాట్లాడుతున్న వైకాపా నాయకుడు రాళ్ల

డి.హిరేహాళ్ డిసెంబరు 8 ప్రభాతవార్త : ఉపాధ్యాయులు విద్యార్థుల్లో దాగివున్న నైపుణ్యాలు వెలికితీసి అద్భుతాలు సాధించాలని వైకాపా నాయకుడు, పాఠశాల పూర్వ విద్యార్థి రాళ్ళ తిమ్మారెడ్డి పిలుపునిచ్చారు.


విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేస్తున్న దృశ్యం

గురువారం డి.హిరేహాళ్ మండలం గొడిసెలపల్లి జిల్లా పరిత్ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రధానోపాధ్యాయురాలు క్రిష్ణవేణి ఆధ్వర్యంలో విద్యార్థులకు అభినందన సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సమావేశంలో రాళ్ళ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగిస్తు వ్యాసరచన, చెకుముకి, ఇతర క్రీడల్లో గ్రామ స్థాయిలో విజయం సాధించిన విద్యార్థులు మండల స్థాయి, జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయికి వెళ్ళేలా ఉపాధ్యాయులు ప్రతిభావంతులను తీర్చి దిద్దాలని ఆయన తెలిపారు. గొడిసెలపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు అరవిందద్, స్వేటి, కస్తూరి, అనిల్‌కుమార్, బి.శివకుమార్ లు రాష్ట్ర, జిల్లా స్థాయి క్రీడలకు ఎంపికయ్యారు. వివిధ క్రీడల్లో ప్రతిభ కనపరచి విజయం సాధించిన 16 మంది విద్యార్థిని విద్యార్థులకు ఆయన తన సొంత ఖర్చులతో బహుమతులు ప్రధానం చేశారు. అంతే కాకుండ పాఠశాలలో గత రెండు సంవత్సరాలుగా పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయుడు లేనందున ఆయ తన సొంత డబ్బు చెల్లించి సైన్స్ ఉపాధ్యాయుడి నియమించారు. విద్యార్థుల విద్య, ప్రతిభ పట్ల ఆయన తనకున్న దాతృత్వాన్ని చాటుకుని ఇతరులకు ఆదర్శంగా నిలిచారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు మాట్లాడుతూ తమ పాఠశాలలో విద్యార్థులు ప్రతి రంగంలో ఉత్తమ ప్రతిభ కనపరుస్తున్నారన్నారు, అదే సమయంలో రాళ్ళ తిమ్మారెడ్డి లాంటి దాతల నుంచి తమ విద్యార్థుల ప్రతిభకు అనుగుణంగ సహాయ సహకారాలు అందుతున్నాయని మరి కొందరు గ్రామ యువకులు, నాయకులు తమవంతు సహకారం అందిస్తే విద్యార్థుల్లోని నైపుణ్యానికి దోహదపడిన వారవుతారని ఆమె తెలిపారు. ఈ అభినందన సమావేశంలో ఉద్యా బృందం, సర్పంచు రాళ్ళ రామలక్ష్మి, పాఠశాల విద్యాకమిటి ఛైర్మెన్ బోయ వన్నూరుస్వామి, ఉపసర్పంచు బోయ నారాయణ, పంచాయతీ కార్యదర్శి బి.రాజు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## ఛలో విజయవాడ ఎంఆర్‌పిఎస్ పిలోస్తోంది తరలి రండి


ఛలో విజయవాడ పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మార్పిఎస్ నాయకులు

గుమ్మఘట్ట, డిసెంబర్ 8 ప్రభాతవార్త : మాదిగ రిజర్వేషణ్‌పోరాట సమితి (ఎమ్మార్పిఎస్) రాష్ట్ర అధ్యక్షులు ఆర్జె ప్రకాష్ మాదిగ ఆదేశాలు మేరకు విజయవాడ తాడేపల్లి ప్రెస్‌క్లబ్‌లో జరిగే రాష్ట్రఎమ్మార్పిఎస్ విస్తృత స్థాయి సమావేశానికి తరలి రావాలని రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.ఈశ్వరయ్య, జిల్లా తాలూకా అధ్యక్షులతో సమావేశం ఏర్పాటు చేసి ఛలో విజయవాడ సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. రాయదుర్గంలో ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లోపి.ఈశ్వరయ్య రాష్ట్రకార్ధయర్శి బిటిపి గోవింద్, జిల్లా ఉపాధ్యక్షులు ఆధ్వర్యంలో రాయదుర్గం తాలూకా అధ్యక్షులు గుమ్మఘట్ట రాజు అధ్యక్షతన ఛలో విజయవాడ పోస్టర్లను విడుదల చేయడం జరిగింది. డిసెంబర్ 12న విజయవాడలో జరిగే సమావేవాన్ని జయప్రదం చేయాలని కోరుకుంటూ ఈ కార్యక్రమంలో బిటిపి వన్నూరు స్వామి, వేపరాల మారెన్న, బూబ్బముద్రం మల్లేసికొల్లప్ప, శివన్న, శివకుమార్ తదితరులు పాల్గొని ఛలో విజయవాడ కార్యక్రమాన్ని జయప్రదంచేయాలని రాయదుర్గం తాలూకా ఎమ్మార్పిఎస్ నాయకులను అనుబంధ సంఘాల నాయకులను కోరారు.

## భూ సర్వే ..డిప్యూటీ తాహిశీల్దార్ పదవీ భాధ్యతలు చేపట్టిన కుళ్ళాయప్ప

కుందుర్పి, డిసెంబర్, 8, ప్రభాతవార్త : మండల భూరీసర్వే డిప్యూటీ తాహాశీల్దార్‌గా కుళ్ళాయప్ప నియమితులయ్యారు మండలంలో 13 రెవెన్యూ పంచాయితి గ్రామాలలో దాదాపు 5సం,లుగా ప్రజలతో సత్‌సంబందాలు కలిగి యుండడం సమస్యలు పరిష్కారంలో చాక చక్కమైన నైపుణ్యం కల్గియుండడం అనుభవాలు దృష్టిలో వుంచుకొని ప్రభుత్వం భూ రీ సర్వే డిప్యూటీ తాహిశీల్దార్‌గా వుత్తర్వులు జారీచెయ్యడం, రైతులు హర్షం వ్యక్త పరిచారు డిపూ ్యటీ తాహాశీల్దార్‌గా భాద్యతలు చేపట్టిన అనంతరం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత ్మకంగా చేపట్టిన భూ రీ సర్వేకు సంబందించి ప్రజలకు అందుబాటులో వుంటూ ఏసమస్యలు వున్నా తాహిశీల్దార్ అర్‌డిఓ రెవెన్యూ సిబ్బంది సహకారంతో రైతులకు న్యాయంచేస్తానని పేర్కొన్నారు.

## ధనియాల పంటను సేద్యం చేస్తున్న రైతన్న


సేద్యం చేస్తున్న రైతన్న జయచంద్రారెడ్డి

బెలుగుప్ప, డిసెంబర్ 8 ప్రభాతవార్త స్తానిక జయచంద్రరెడ్డి అనే రైతు గురువారం రోజున ధనియాల పంటను ఒక్కడే నాలుగు ఎకరాలను మూడు పలకల గుంటక తోసే ద్యంచేశాడు. ఈ సందర్భంగా రైతు జయచంద్రారెడ్డి మాట్లాడుతూ.. కూలీ ఇవ్వడానికి డబ్బులు నేనే సేద్యం చేస్తున్నానని, ఇంతకుముందు వేసినపంటలన్నీ నష్టం రావడంతో ఈ సేద్యం చేస్తున్నానని తెలిపారు. ఆయనకు కొంత మంది రైతులు వెళ్లి పూలహారంతో సన్మానించారు. అందుకోసం ప్రభుత్వం ఆదుకోవాలని, నష్టపోయిన పంటలకు నష్టపరిహారం, ఇన్‌పుట్ సబ్సిడిని అందించాలని కోరారు. అదే విధంగా ప్రస్తుతం చేస్తున్న వాటికి ఇన్సురెన్స్‌ను కల్పించాలని కోరారు.

## ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వేపై రెవెన్యూ సిబ్బందికి ..అవగాహన


రెవెన్యూ సిబ్బందికి సర్వేపై సలహాలు సూచనలిస్తున్న తాహిశీల్దార్ షాబుద్దీన్

కుందుర్పి, డిసెంబర్, 8, ప్రభాతవార్త: మండల కేంద్రం తాహిశీల్దార్ కార్యాలయంలో తాహిశీల్దార్ షాబుద్దీన్ అధ్వర్యంలో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ రీ సర్వేపై డిప్యూటీ తాహిశీల్దార్, సర్వేయర్స్, విఅర్ఓలు సీనియర్ అసిస్టెంట్స్, జూనియర్ అసిస్టెంట్స్, సంబందిత సిబ్బందికి తాహిశీల్దార్ షాబుద్దీన్ సమస్యలపై అవగాహన కల్పిస్తూ సలహాలు సూచనలు యివ్వడం జరిగింది ముందుగా భూ రీ సర్వే డిప్యూటీ తాహిశీల్దార్‌గా బాధ్యతలు చేపట్టిన కుళ్ళాయప్పకు సిబ్బంది స్వాగతం పలుకడం జరిగింది ఈసందర్భంగా తాహిశీల్దార్ మాట్లాడుతూ రెవెన్యూ రికార్డు ప్రకారం సర్వేచెయ్యవలసియుంటుందని సమస్యలకు తావు యివ్వరాదని తీవ్రమైన సమస్యలుంటే అర్‌డిఓ తో సంప్రదింపులు జరపవలసి యుంటుందని పేర్కొన్నారు జగనన్న శాశ్వత భూ హక్కు పత్రం యివ్వవలసి యుంటుంది కావున ఏలాంటి తప్పులకు తావులేకుండా చూడాలని పేర్కొన్నారు సర్వేదాదాపు సం,కాలం పట్టవచ్చు అన్నారు విధులు పరంగా ప్రతి ఒక్కరు సమయ పాలన పాటించాలని ప్రత్యేకంగా తెలియజేయడం జరిగింది

## వివాహ కార్యక్రమానికి హాజరైన ఉన్నం


నూతన వధువరులతో టిడిపి ఉపాధ్యక్షులు తదితరులు

కళ్యాణదుర్గం, డిసెంబర్ 8 ప్రభాతవార్త : బొమ్మనహాళ్ మండలం రంగాపురం క్యాంప్‌లో తుమాటి నాగరాజు కుమారుడు పవన్‌కుమార్ వెడ్స్ ప్రియాంక వివాహానికి టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు, మాజీ శాసనసభ్యులు ఉన్నం హనుమంతరాయ చౌదరి, మాజీ సర్పంచు గోవిందరెడ్డి, నర్సాపురం ప్రసాద్, మాజీ మండల కన్వీనర్‌చలపతి తదితరులు హాజరై నూతన వధువరులను ఆశీర్వదించారు.

## శ్రీ చైతన్యలో ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమం


కార్యక్రమంలో అవగాహన కల్పిస్తున్న విద్యార్థులు

కళ్యాణదుర్గం టౌన్, డిసెంబర్ 8 ప్రభాతవార్త : శ్రీ చైతన్య పాఠశాలలో ఏజిఎం సుబ్బారెడ్డి ఆదేశాలమేరకు శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు ట్రాఫిక్‌పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సిఐ తేజ మూర్తి ఆయన చేతుల మీదుగా పచ్చజెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు విద్యార్థులు స్కూల్ నుంచి టీ సర్కిల్ వరకు రోడ్డు భద్రతా అంశాలపై అవగాహన కల్పించారు. అంతేకాకుండా రోడ్డుపై వెళ్తున్న వాహన దారుల్లోఎవరైతే హెల్మెట్, సీటుబెల్టు ధరించిన వారికి గులాబినందించి వారికి అప్రమత్తంగా ఉండాలని తెలియజేశారు. అదే విధంగా పౌరాణిక నాటకాలలో యమధర్మరాజు పాత్రలు, డాన్స్, పాటలు, పిరమిడ్స్‌తో, డ్రమ్స్ వాయిద్యాలతో తమ నాటకం నైపుణ్యంతో రమనీయంగా ప్రజలందరూ ఆధ్చర్యపడేలా ఆనందంతో హృదయాలను మైమరపించారు. ఈ కార్యక్రంలో సిఐ తేజమూర్తి, పాఠశాల ప్రిన్సిపాల్ ఫిలిప్ కుమార్, డీన్ తిప్పారెడ్డి, ప్రైమరీ ఇంచార్జ్ లీలావతి, పిఈటి అశోక్, హరి, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన


విద్యార్థులకు వైద్య సలహాలు ఇస్తున్న డా.శ్రీ లక్ష్మి

బొమ్మనహాళ్, డిసెంబర్ 8 ప్రభాతవార్త : మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ హై స్కూల్‌లో గురువారం బొమ్మనహాళ్ పిహెచ్‌సి డాక్టర్ శ్రీ లక్ష్మి ఆధ్వర్యంలో సీజనల్ వ్యాధులపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వ్యక్తిగత పరిశుభ్రత, యుక్త వయస్సలో బాలికలకు రక్తహీనత, వారికి అవసరమైన మందులు ఉచితంగాఅందజేశామన్నారు. ప్రతి ఒక్కరూ చలికాలం, వేసవి కాలం తప్పనిసరిగా 5 లీటర్ల నీరు తీసుకోవాలని ఆటల పోటీలలో చురుగ్గా పాల్గొనాలని వారు సలహాలు ఇచ్చినట్లు ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో వారితోపాటు పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజ్‌కుమార్, వైద్య సిబ్బంది పబ్లిక్ హెల్త్ నర్సు శ్రీలత, సూపర్‌వైజర్లు యుగంధర్, రుక్మిణి, నర్సు జైనాబి, భాగ్యలక్ష్మి, ఆశావర్కర్లు మధులత, రంగవేణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## మండల అభివృద్ధిపై కలిసికట్టుగా పనిచేద్దాం ఎంపిపి కంభం చంద్రశేకర్‌రెడ్డి

బ్రహ్మసముద్రం డిశంబర్ 08 ప్రభాతవార్త,: మండల అభివృద్ధిపై కలిసికట్టుగా పనిచేద్దాంఅని ఎంపిపి కంభం చంద్రశేకర్‌రెడ్డి అన్నారు.మండల అభివృద్ధి ప్రణాలికపై సమీక్షాసమావేశాలలో భాగంగా స్త్రీశక్తి భవన్‌లో గురువారం నిర్వహించిన సమావేశంలోఎంపిపి మాట్లాడుతూ ప్రతి ఒక్కరు తమతమ పరిధిలోని అభివృద్ధిపై వివరించి ప్రణాలిక రచించి గ్రామ,మండల అభివృద్ధికి అధికారులు,ప్రజాప్రతినిధులతో కూడిన నివేదిక తయారుచేస్తే మండల అభివృద్ధికి అవసరమైన నిధులు రావడానికి తనవంతుగా కృషిచేస్తానని అన్నారు.అనంతరం జడ్‌పిటీసి ప్రభావతి మాట్లాడుతూ జిల్లాస్థాయిలో మండల అభివృద్ధికి అవసరమైన నిధులు రప్పించడంలో తన వంతుగా కృషిచేస్తానని అన్నారు.ఈ కార్యక్రమానికి మండల వ్యాప్తంగావున్న సర్పంచ్‌లు,ఎంపిటీసీలు.అన్నిశాకల అధికారులు పాల్గొన్నారు.

## నష్టపోయిన ప్రతి రైతును ఆదుకోవాలని సాధన డిమాండ్ల కోసం 12న అన్ని జిల్లాల కలెక్టరేట్‌ల ఎదుట ధర్నా

- సిపిఐ, రైతు విభాగం


మాట్లాడుతున్న సిపిఐ, రైతు విభాగం నేతలు

కళ్యాదుర్గం టౌన్, డిసెంబర్ 8 ప్రభాతవార్త : రాష్ట్ర వ్యాప్తంగా అతివృష్టి, అనావృష్టితో నష్టపోయిన రైతాంగాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని సిపిఐ రాష్ట్ర రైతు విభాగం ఆధ్వర్యంలో ఈ నెల 12న అన్ని జిల్లాల కలెక్టరేట్‌కార్యాలయాలను ముట్టడి కార్యక్రమానికి తరలిరావాలని కరపత్రాలను విడుదల చేశారు. హక్కుల సాధన డిమాండ్ల కోసం ప్రజలు రైతులు పెడెత్తు ఎత్తున తరలి రావాలని, విజయవంతం చయాలిన కోరారు. ఈ సందర్భంగా మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ డాక్టర్ స్వామినాథన్ కమిటీని అలుపర్చాలని డిమాండ్ చేశారు. వైసీపీ పాదయాత్ర ఎన్నికల హామీలో చెపపన వాగ్దానాలను పూర్తి చేసేలోపే నాలుగేళ్లు గడిచాయని గుర్తు చేశారన్నారు. కళ్యాణదుర్గం ప్రాంతంలో 114 చెరువులకు నీరు ఎప్పుడు అందిస్తారని స్థానిక ఎమ్మెల్యే, రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ఉషాశ్రీ చరణ్‌ను ప్రశ్నించారు.

## హెల్మెట్ ధరించండి - ప్రాణాలు కాపాడుకోండి


ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు

హిందూపురం టౌన్, డిసెంబర్ 8 ప్రభాతవార్త : ద్విచక్రవాహనదారుడు హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరిస్తే ప్రమాదాల సమయంలో ప్రాణాలు కాపాడుకోవచ్చని హెల్మెట్ ఆవశ్యకతపై గురువారం శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఒకటవ పట్టణ సిఐ ఇస్మాయిల్ ముఖ్యఅతిథిగా హాజరై ర్యాలీని ప్రారంభించారు. చిన్నమార్కెట్ కూడలి నుండి సద్భవన కూడలి వరకు విద్యార్థులు ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా సిఐ ఇస్మాయిల్, శ్రీచైతన్య పాఠశాల ఎజిఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ హెల్మెట్ ధరించకుండా ప్రయాణాలు చేయడం వల్ల ప్రాణానికి ముప్పని వాహనదారుడు హెల్మెట్ ధరిస్తే తనతోపాటు తన కుటుంబం కూడా ఆనందంగా వుంటారని వారు తెలిపారు. ఈ కార్య క్రమంలో ఎఐ ప్రభాకర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ ప్రకాష్‌రెడ్డి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

## వాహనాల వేలంలో ప్రభుత్వానికి ఆదాయం


వేలం నిర్వహిస్తున్న అధికారులు

హిందూపురం, డిసెంబర్ 8 ప్రభాత వార్త : అక్రమ మద్యం తరలిస్తూ పట్టుబడిన 18 వాహనాలకు గురువారం హిందూపురం రెండవ పట్టణ పోలీసుస్టేషన్‌లో సెబ్ డిప్యూటి కమీషనర్ ఆధ్వర్యంలో వేలం నిర్వహించారు. ఈ వేలంలో ప్రభుత్వానికి 3,28,040 రూపాయల ఆదాయం సమకూరినట్లు రెండవ పట్టణ సిఐ వెంకటేశ్వర్లు తెలిపారు. ఈ వేలం పాటలో సెబ్ సిఐ లక్ష్మీదుర్గయ్య, అధికారులు పాల్గొన్నారు.

## జూదరులు అరెస్ట్

పరిగి, డిసెంబర్ 8 ప్రభాతవార్త : మండలంలోని పెద్దిరెడ్డిపల్లి గ్రామ సమీపంలో జూదమాడుతున్న నలుగురు వ్యక్తులను గురువారం అరెస్ట్ చేసినట్లు పరిగి ఎస్ఐ నరేంద్ర తెలిపారు. జూదమాడుతున్నారన్న సమాచారం మేరకు పోలీసులు దాడులు జరిపి జూదమాడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి వద్ద నుండి 5,300 రూపాయలను స్వాధీనం చేసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

## వడ్డె కిష్టప్ప కుటుంభానికి అండగా వుంటాం


కిష్టప్పను రామర్శిస్తున్న దృశ్యం

బత్తలపల్లి, డిసెంబర్ 8 ప్రభాతవార్త : వైకాపా నాయకులు, మాజీ ఎంపిటిసి కళావతి భర్త వడ్డె కిష్టప్ప కుటుంభానికి తాము అండగా వుంటానని బగ్గిరి బయపరెడ్డి అన్నారు. గురువారం వడ్డెరకాలనీలో వుంటున్న వడ్డెకిష్టప్ప పెరాలసిస్‌తో బాధపడుతూ చికిత్సలు చేయించుకుని ఇంటికి వచ్చాడు. విషయం తెలుసుకున్న బయపరెడ్డి, ఉప సర్పంచు కోటి గోపినాథ్‌లు వారి ఇంటికి వెళ్లి పరామర్శించారు. చికిత్సలు చేయించుకున్నది ఆరాతీశారు. విషయాన్ని ఎంఎల్ఏ కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి దృష్టికి తీసుకువెళతామన్నారు. వారి వెంట ఈడిగ కాశప్ప, అక్కిం నరసింహుడు, సంద్రా రామక్రిష్ణ, బండి నాగబూషణ, ముసలప్ప తదితరులు వున్నారు.

## జలజీవన్‌మిషన్ కింద 6.32 కోట్ల పనులు

అగళి, డిసెంబర్ 8 ప్రభాతవార్త : జల జీవన్‌మిషన్ కింద ముఖ్యంగా కేంద్రప్రభుత్వం నుంచి జలజీవన్ మిషన్ కింద 6.32 కోట్లు మంజూరు అయినట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ విజయ్ తెలిపారు. పనులు మంజూరు అయ్యాయి కానీ వీటికి టెక్నికల్ శాంక్షన్‌రావాల్సి ఉందన్నారు. దీని ఉద్దేశ్యం ప్రతి ఇంటికి కొళాయి వేయడంతోపాటు ఓవర్‌హెడ్ ట్యాంకుల నిర్మాణం, పైప్‌లైన్లు, నూతనంగా బోర్లను ఏర్పాటు చేసి ప్రజలకు మంచి నీటిని అందించడం దీని ఉద్దేశ్యం. ఇందులో భాగంగా గతంలో కేవలం 5 లక్షల రూపాయల వరకు పనులుమంజూరు కాగా కొంత వరకు ఆ పనులు జరిగాయి. రెండో విడత ఈ పథకం కింద అగళికి 37.30 లక్షలు, దేవరపల్లికి 21.70 లక్షలు, గాయత్రి కాలనీకి 25.50 లక్షలు, హెచ్‌డి హళ్లికి 33.70 లక్షలు, హల్లికెరకు 33.40 లక్షలు, ఇనగలూరుకు 33.40 లక్షలు, లక్ష్మీపురానికి 21.70 లక్షలు, రాంపురం, గొల్లహట్టికి 25.50 లక్షలు, దాసేగౌడనహళ్లికి 34.60 లక్షలు, హనుమనపల్లికి 7.70 లక్షలు, పూలపల్లికి 19.30లక్షలు, జంగమరపల్లికి 7.70 లక్షలు, కోడిపల్లికి 33.70 లక్షలు, కదిరేపల్లికి 21.70 లక్షలు, కదిరేపల్లి గొల్లహట్టి 21.70 లక్షలు, మధూడికి 33 లక్షలు, నర్సాంబూదికి 33.70 లక్షలు, కెంకెరకు 21.70 లక్షలు, పి.బ్యాడిగెరకు 33.70 లక్షలు, వడగుంటన పల్లి 21.70 లక్షలు, బొమ్మాసనపల్లి 34.60లక్షలు,ముకడాంపల్లి 31.10లక్షలు, రామనపల్లి 33.70 లక్షలు, ఆలూడి 7.70 లక్షలు మంజూరు అయ్యాయని, మొత్తం 24 పనులకు గాను 6.32 కోట్లు విలువైన పనులు మంజూరు అయ్యాయని టెక్నికల్ శాంక్షన్ వచ్చిన వెంటనే పనులు ప్రారంభిస్తామని ఏఈ తెలిపారు.

## ఎస్ఐ,కానిస్టేబుల్ పోటీపరీక్షలకై వాల్మీకి విద్యార్థులకు ఉచిత శిక్షణ

కొత్తచెరువు, డిసెంబర్ 08, ప్రభాతవార్త : శ్రీసత్యసాయి, అనంతపురం ఉమ్మడి జిల్లాలకు చెందిన అర్హత కలిగిన, ఇంటర్, డిగ్రీ చదువుతున్న వాల్మీకి విద్యార్థుల కొరకు వాల్మీకి ఎంప్లాయీస్ అండ్ ప్రొఫెషనల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వాల్మీకి నిరుద్యోగ యువత కోసం ఎస్ఐ, కానిస్టేబుల్ పోటీపరీక్షలకు అర్హులైన విద్యార్థులకు ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు నిర్వాహకులు తెలియజేశారు. ఈ నోటిఫికేషన్‌కు సంబంధించి ఈ నెల 10వ తేది శనివారం ఉదయం 10:00 గంటలకు రుద్రం పేట బైపాస్‌లో ఉన్న వాల్మీకి కల్యాణమండపం నందు అర్హత పరీక్ష నిర్వహించడం జరుగుతుందని, అందులో ఎంపికైన విద్యార్థినీ విద్యార్థులకు ఉచిత శిక్షణతో పాటు, వసతి, భోజన సౌకర్యాలు కల్పించడం జరుగుతుందన్నారు. ఇందులో స్టడీమెటీరియల్‌ను కూడా ఉచితంగా అందిస్తామని, కావున ఆసక్తిగల వాల్మీకి విద్యార్థులు ఈ పోటీ పరీక్షల్లో పాల్గొని అర్హత సాధించాలని వారు కోరారు. ఇందులో ఎంపికైన విద్యార్థులు తమ 10వ తగరతి, ఇంటర్, డిగ్రీ సర్టిఫికెట్ల నకలుతో పాటు కులధృవీకరణ పత్రాలు, ఆధార్, పాస్‌పోర్టు సైజ్ ఫోటోలు, తమ దుస్తులతో పాటు రావాల్సి ఉంటుందన్నారు. కావున ఈ అర్హత పరక్షకు హాజరు కాదలచిన విద్యార్థులు అనంతపురంలోని వాల్మీకి కల్యాణమండపంలో ఈ నెల 9వ తేది సాయంత్రం 05:00 గంటలలోపు తమ పేర్లను నమోదు చేయించాలని కోరారు.

## ఫ్యాన్‌కు ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య


మృతి చెందిన భాస్కర్ మృతదేహం

తాడిమర్రి, డిసెంబర్ 8 ప్రభాతవార్త : తాడిమర్రిలోని తూర్పు చెరువు కట్ట సమీపంలోని న్యూ ఎస్సీ కాలనీలో ఉరివేసుకుని యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన జరిగింది. వివరాల మేరకు.. ముగ్గురు కూతుళ్ళు, భార్యతో కలిసి వ్యవసాయం చేస్తూ, కూలీ పనులు చేస్తూ కుటుంబ పోషణ నిర్వహించే తగిలే భాస్కర్ గురువారం తెల్లవారు జామున ఫ్యాన్‌కు ఉరివేసుకుని ఇంట్లోనే మృతి చెందాడు. మృతుదుని పొలంలో వ్యవసాయం నిమిత్తం 1.70లక్షలు క్రాప్‌లోన్ తీసుకున్నారు. అలాగే మహిళా సంఘంలో వెలుగు ద్వారా 65వేలు, ఆర్డిటి ద్వారా 35వేలు, శ్రీనిధి ద్వారా 90వేలు అప్పులు చేశారు. పెట్టుబడి దాదాపు వ్యవసాయం మీద 5 లక్షల దాకా ఖర్చు పెట్టాడు. మొత్తం 8.60 లక్షలు బాకీ తేలడంతో తీవ్ర ఆందోళనకు గురై అర్ధరాత్రి ఈ ఘటనకు పాల్పడినట్లు తెలుస్తోంది. ఇతనికి భార్య లక్ష్మి, కూతుళ్ల మోక్షిత, శ్రావిక, శర్వితలు ఉన్నారు. కేసు నమోదు చేసుకుని తాడిమర్రి ఎస్ఐ డి.లక్ష్మినారాయణ దర్యాప్తు చేస్తున్నారు.

## 10న ఉరవకొండకు మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రాక

-సత్యం కన్వెన్షన్ హాల్‌లో జరిగే విస్తృతస్థాయి సమావేశానికి తరలిరండి

-పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చిన ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి


ముఖ్య నాయకులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి

ఉరవకొండ, డిసెంబర్ 8 ప్రభాతవార్త : ఈనెల 10వ తేదీన శనివారం రాష్ట్ర విద్యుత్, అటవీ, భూగర్భ గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఉరవకొండకు వస్తున్నారని ఈ సందర్భంగా మధ్యాన్నం 2 గంటలకు సత్యం కన్వెన్షన్ హాల్‌లో ఆయన పార్టీ ఉరవకొండ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశం నిర్వహిస్తున్నారని అందరూ తరలివచ్చి విజయవంతం చేయాలని ఉరవకొండ మాజీ ఎమ్మెల్యే వై.విశ్వేశ్వరరెడ్డి వైసీపీ శ్రేణులకు పిలుపునిచ్చారు. పట్టణంలోని స్థానిక తన క్యాంపు కార్యాలయంలో గురువారం ఆయన పార్టీ నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వై.విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ నియోజకవర్గంలోని అన్ని మండలాల కన్వీనర్లు, ముఖ్య నేతలు, ప్రజా ప్రతినిధులు, కార్పొరేషన్ల డైరెక్టర్లు, పీఏసీఎస్‌ల ఛైర్మెన్లు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు సభ్యులు తదితరులు తరలిరావాలని పిలుపునిచ్చారు.

## రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొనేందుకు తరలివెళ్లిన ఖోఖో బాలికల జిల్లా జట్టు

-ముగిసిన మోపిడిలో 10 రోజులు కొనసాగిన శిక్షణా శిబిరం


రాష్ట్రస్థాయి పోటీలకు బయలుదేరిన ఖోఖో బాలికల జట్టుతో కోచ్ తదితరులు

ఉరవకొండ, డిసెంబర్ 8 ప్రభాతవార్త : ఖోఖో అండర్-18 బాలికల జిల్లా జట్టు గురువారం మండల పరిధిలోని మోపిడి నుండి కర్నూల్ జిల్లా ఆత్మకూరుకు బయలుదేరి వెళ్లింది. అక్కడ పోటీలు 9,10,11 తేదీల్లో మూడు రోజులపాటు కొనసాగనున్నాయి. ఖోఖో అసోసియేషన్ బాధ్యులు నిరంజన్‌రెడ్డి, పుల్లారెడ్డిల ఆదేశాల మేరకు స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ ప్రభాకర్ ఆధ్వర్యంలో గ్రామంలోని శ్రీ సంజప్పతాత ఆలయ ఆవరణంలో ఖోఖో బాలికల జట్టుకు వసతి, భోజనంతో కూడిన 10 రోజుల శిక్షణ పూర్తీ అయింది. ఈ క్రమంలో పాఠశాల ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శిక్షణకు సహకరించిన పాఠశాల తల్లిదండ్రుల కమిటీ ఛైర్మెన్ సతీష్, గ్రామస్థులు జగన్నాద్, జ్యోతి దంపతులు, ధనుంజయ, రాజ్‌కుమార్‌లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిద్దప్ప, ఉప సర్పంచ్ లాలెప్ప, సంజయ్ తదితరులు పాల్గొన్నారు.

## పోలీస్ స్టేషన్ ముందు అయ్యప్ప మాలదారుల నిరసన..!

-ఆలయంవద్ద ద్విచక్రవాహనాల పెట్రోల్ వైర్లు కోసేశారంటూ ఆవేదన


పోలీస్ స్టేషన్‌వద్ద అయ్యప్ప మాలదారులు నిరసన తెలుపుతున్న దృశ్యం

ఉరవకొండ, డిసెం బర్ 8 ప్రభాతవార్త : స్థానిక అప్‌గ్రేడ్ పోలీస్ స్టేషన్ వద్ద గురువారం ఉదయం అయ్యప్ప మాలదారులు పెద్ద ఎత్తున నిరసన తెలిపారు. అంబేద్కర్ నగర్‌లోగల శ్రీ అయ్యప్పస్వామి ఆలయంవద్ద నిలిపి ఉంచిన తమ ద్విచక్రవాహనాల పెట్రోల్ వైర్లను ఎవరో దుండగులు కోసేశారని వారిని గుర్తించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ వినూత్న రీతిలో స్టేషన్ ముందు అయ్యప్ప గేయాలు ఆలపించారు. అంతకు ముందు అయ్యప్ప ఆలయం నుండి వందలాది ద్విచక్రవాహనాలతో క్లాక్‌టవర్ కూడళి మీదుగా పోలీస్ స్టేషన్ వరకు నిరసన ర్యాలీ కొనసాగించారు. ఈ సందర్భంగా అయ్యప్ప మాలదారులు పలువురు మాట్లాడుతూ తమ ద్విచక్రవాహనాలను గుడి బయట నిలిపివుంచి భజనలు, పూజల్లో ఉన్న సమయంలో బుధవారం రాత్రి ఎవరో దుండగులు అక్కడి వచ్చి దాదాపు 30 వాహనాల పెట్రోల్ వైర్లను కోసేశారని ఆ సమయంలో ఎవరైనా అక్కడ నిప్పు పడేసి ఉంటే వాహనాలన్నీ తగలబడిపోయి భారీగా ఆస్థి, ప్రాణనష్టం జరిగి ఉండేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్దేశపూర్వకంగా పెట్రోల్ వైర్లు కోసేసిన వారిపై కఠిన చర్యలు తీసుకొని తమ వాహనాలకు భద్రత కల్పించాలని కోరారు.

## విద్యార్థులకు ప్లేట్లు, విద్యాసామాగ్రి పంపిణీ


విద్యార్థులకు ప్లేట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

కొత్తచెరువు, డిసెంబర్ 08, ప్రభాతవార్త : మండల పరిధిలోని నారేపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల యందు విద్యార్థినీ, విద్యార్థులకు ఖిద్మత్ ఎ ఖల్క్ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో భోజన ప్లేట్లు, విద్యోపకరణాలు పంపిణీ చేశారు. పుట్టపర్తికి చెందిన నాగప్ప జ్ఞాపకార్థం ఆయన కూతురు కవిత సహకారంతో వీటిని పంపిణీ చేయడం జరిగిందని ఆ సొసైటీ నిర్వాహకులు షామీర్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో సిద్దు, అశోక్, వేణు, జయంత్ తదితరులు పాల్గొన్నారు.

## ద్విచక్రవాహనం ఢీకొని వృద్ధురాలికి గాయాలు


గాయపడ్డ వృద్ధురాలు లక్ష్మిదేవి

కొత్తచెరువు, డిసెంబర్ 08, ప్రభాతవార్త : మండల కేంద్రమైన కొత్తచెరువులోని కొడపగానిపల్లి గ్రామంలో ప్రాథమిక పాఠశాల ఎదురుగా రోడ్డు దాటుతున్న సమయంలో కొత్తచెరువు నుండి వస్తున్న ద్విచక్రవాహనం ఢీ కొనడంతో గ్రామానికి చెందిన చిన్ననంజిరెడ్డి భార్య లక్ష్మిదేవి అనే వృద్ధురాలికి తీవ్రగాయాలు అయ్యాయి. పోలీసులు, బంధువులు అందించిన వివరాల ప్రకారం తన వ్యవసాయ పనుల కోసం కూలీలను పిలిచేందుకు వృద్ధురాలు రోడ్డు దాటుతుండగా, మైలసముద్రం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ద్విచక్రవాహనం వస్తూ ఆమెను బలంగా ఢీ కొన్నాడు. దీంతో ఆమె కూడిచెయ్యి, పెదవులు, తలకు బలంగా గాయాలయ్యాయి. వెంటనే 108 అంబులెన్స్‌లో శ్రీసత్యసాయి సూపర్‌స్పెషాలిటీ ఆసుపత్రికి ఆ వృద్ధురాలిని తరలించి చికిత్స అందించారు. ప్రాణాపాయం ఏమీ లేదని, గాయలు తీవ్రంగా తగిలినట్లు తెలుస్తున్నది.

